శ్రీరస్తు

జాగ్రత పంచకమ్

(జగద్గురు శ్రీ ఆది శంకరాచార్య విరచితం)

శుభమస్తు

- భావార్థముతో -





సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/



ఈ లోకములో తాను, తన కుటుంబము తప్ప మిగిలిన వారందరూ మరణిస్తారని, తనను ఎవరూ ఏమీ చేయలేరనీ తానూ, తన కుటుంబము, బంధువులు, మిత్రులు శాశ్వతంగా ఉండిపోతామనీ, తమ సంపద, జ్ఞానము తమ వద్దే ఉండిపోతాయని అహంకరిస్తూ, దుర్లభమైన మానవ జన్మను వృథా చేసుకుని జీవిత చరమాంకంలో పశ్చాత్తాపపడే వారికి జగద్గురువులు శ్రీ ఆది శంకరులు చేసే హెచ్చరికయే ఈ జాగ్రుత పంచకం. దీనిని పూర్తిగా అర్థం చేసుకుని జాగ్రుత్త వహిస్తే మన జన్మ ధన్యం.

జగద్గురు శ్రీ ఆది శంకరాచార్య విరచితం

జాగ్రత పంచకమ్ - భావార్థముతో.

01. మాతా నాస్తి పితా నాస్తి । నాస్తి బంధు సహోదరః।
అర్థం నాస్తి గృహం నాస్తి । తస్మాత్ జాగ్రత జాగ్రత॥

తల్లి, తండ్రి, బంధువులు, సహోదరులు, ధనము, గృహము ఇవేవీ కూడా శాశ్వతం కావని అర్థం చేసుకుని జాగ్రత్తగా ప్రవర్తించు.

తల్లి, తండ్రి, బంధువులు, అన్నదమ్ములు, ధనము, ఇల్లు - ఇవి అన్నియు మిధ్యయే. ఇవి ఏవియు నిజముగా లేవు. అందుచే ఓ మానవుడా సావధానుడవై ఉండుము.

\- - - - - -

02. జన్మ దుఃఖం జరా దుఃఖం । జాయా దుఃఖం పునః పునః।
సంసార సాగరం దుఃఖం । తస్మాత్ జాగ్రత జాగ్రత॥

ఈ పుట్టుక దుఃఖమయమైనది. వయో భారము దుఃఖమయము. నీ భాగస్వామి దుఃఖమయము. అసలు ఈ సంసారమే దుఃఖమయము. ఈ విషయమును గ్రహించి జాగ్రత్తగా వ్యవహరించు.

ఈ జన్మము, వృద్ధాప్యము, భార్య, ఈ సంసారము – ఇవన్నియు దుఃఖ భరితములు. కావున ఓ మానవుడా సావధానుడవై ఉండుము.

\- - - - - -

03. కామః క్రోధశ్చ లోభశ్చ । దేహే తిష్ఠతి తస్కరాః।
జ్ఞాన రత్నాపహారాయ । తస్మాత్ జాగ్రత జాగ్రత॥

నీలో ఉన్న జ్ఞానము అనే రత్నమును దొంగిలించుటకు, కామ – క్రోధ – లోభ – మోహ – మద – మాత్సర్యము లనే దొంగలు నీలోనే పొంచి ఉన్నారు. వారి పట్ల అప్రమత్తముగా జాగ్రత్తగా వ్యవహరించు.

కామము, క్రోధము, లోభము మొదలైన అరిషడ్వర్గములు మనలోని జ్ఞానమనెడు విలువైన రత్నములను దొంగిలించుటకై మన దేహమునందు దాగి యున్న దొంగలు. కావున ఓ మానవుడా సావధానుడవై ఉండుము.

\- - - - - -

04. ఆశయా బధ్యతే జంతుః । కర్మణా బహు చింతయా।
ఆయుః క్షీణమ్ నజానాంతి । తస్మాత్ జాగ్రత జాగ్రత॥

మానవులమైన మనము జంతువులవలే ఆశలు అనే పాశములతో బంధింపబడి ఉన్నాము. అనేకమైన అనవసరపు ఆలోచనలు, కర్మలలో పడి, ఆయువు తరిగిపోతున్న సంగతి గ్రహించలేక పోతున్నాము. ఈ విషయములో జాగ్రత వహించు.

ఈ మనుష్యులు ఎల్లప్పుడూ ఏదియో చేయవలెనను ఆశతోనే జీవింతురు. కానీ తరిగిపోవుచున్న జీవిత కాలమును గుర్తింపరు. కావున ఓ మానవుడా సావధానుడవై ప్రవర్తించుము.

\- - - - - -

05. సంపదః స్వప్నసంకాశః । యౌవనం కుసుమోపమమ్।
విధు చంచలం ఆయుశమ్ । తస్మాత్ జాగ్రత జాగ్రత॥

మన సంపదలన్నీ మిథ్య – అవి కలలాగ కరిగిపోతాయి. యౌవనము క్షణికము. అది కొద్ది కాలము మాత్రమే ఉంటుంది. జీవితము ఒక మెరుపు వలె మెరిసి మాయమై పోతుంది. ఈ విషయమును గ్రహించి జాగ్రత వహించు.

మన సంపదలన్నియు ఒక కలవంటివి. యౌవనము ఒక పూవు వలె మన జీవితము లో స్వల్ప కాలము మాత్రమే ఉండునది. ఈ జీవితమూ మెరుపు వలె క్షణభంగురము. కావున ఓ మానవుడా సావధానుడవై ప్రవర్తించుము.

– – – – – –

– – – – – ఇతి జగద్గురు శ్రీ ఆది శంకరాచార్య విరచిత
జాగ్రత పంచకం సంపూర్ణమ్ – – – – –

– – – = – – –

అధిక పాఠం:

01. క్షణం విత్తం, క్షణం చిత్తం, క్షణం జీవితమావయోః।
యమస్య కరుణా నాస్తి తస్మాత్ జాగృథ జాగృథ॥

ధనము, బుద్ధి, జీవితము ఇవన్నియు క్షణభంగురములు. మన ప్రాణములను హరించుటకై వేచియున్న యముడు ఏ మ్రాత్రము దయ జూపడు. కావున ఓ మానవుడా సావధానుడవై ఉండుము.

– – – – – –

02. యావత్ కాలం భవేత్ కర్మ తావత్ తిష్ఠతి జంతవః।
తస్మిన్ క్షీణే వినశ్యంతి తత్ర కా పరివేదన॥

మనుషులకు వారి కర్మానుసారము జీవిత కాలము ఉండును. అది తీరిన తరువాత వారును నశింతురు. దానికై దుఃఖించుట ఎందులకు?

\- - - - - -

03. ఋణానుబంధ రూపేణ పశుపత్నిసుతాదయః।
ఋణక్షయే క్షయం యాంతి తత్ర కా పరివేదన॥

గత జన్మ ఋణానుబంధముచే పశు, పత్ని, పుత్ర లాభము గల్గును. ఆ ఋణము తీరగనే వారును పోవుదురు. దానికై దుఃఖించుట ఎందులకు?

\- - - - - -

04. పక్వాని తరుపర్ణాని పతంతి క్రమశో యథా
తథైవ జంతవః కాలే తత్ర కా పరివేదన॥

చెట్ల యొక్క పండిన ఆకులు ఏ విధముగా రాలిపోవునో అదే విధముగా ఆయువు తీరిన వారు మరణింతురు. దానికై దుఃఖించుట ఎందులకు?

\- - - - - -

05. ఏక వృక్ష సమారూఢ నానాజాతి విహంగమాః।
ప్రభతే క్రమశో యాంతి తత్ర కా పరివేదన॥

రాత్రి చెట్లపై వివిధ జాతుల పక్షులు చేరును. మరల సూర్యోదయము కాగానే ఒక్కటొక్కటిగా ఎగిరిపోవును. ఇదే విధముగా మానవ జీవితములందును సంయోగ వియోగములు సంభవించును. దానికై దుఃఖించుట ఎందులకు?

\- - - - - -

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్
Kiron Type Institute

06. ఇదం కాష్టం ఇదం కాష్టం నద్యాం వహతి సంగతః।
సంయోగాశ్చ వియోగాశ్చ కా తత్ర పరివేదన॥

ప్రవహించుచున్న నదిలో కళేబరములు తేలుచు, ఒకప్పుడు కలియుచు, ఒకప్పుడు విడిపోవుచుండును. ఇదే విధముగా మానవ జీవితములందును సంయోగ వియోగములు సంభవించును. దానికై దుఃఖించుట ఎందులకు?

Kiron Type Institute





(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి.–944 044 9650, 994 994 1430)